క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న మధుబాబు

పాతపట్నం: అనాథులను ఆదుకోవడంలోనే సంతృప్తి ఉంటుందని మహేంద్ర కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న నవ జీవన్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నలక్ష్మి ఉచిత రేషన్ ద్వారా 40 మంది నిరుపేద వితంతువులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, ట్రస్ట్ నిర్వాహకులు నరసింహ రెడ్డి, బాబూరావు, మేనేజర్ ఎస్.వి.రమణ, బి.గౌరీ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



తహసీల్దార్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీఆర్‌ఏలు

పాతపట్నం: ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని స్థానిక తహసీల్దార్ ఎస్.ప్రసాదరావుకు మండల వీఆర్‌ఏలు సోమవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70 శాతం పెంచాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నోటీస్ అందజేసిన వారిలో పి.వెంకటరమణ, పి.అప్పలస్వామి, బి.బైరాగి, రాజారావు, తదితరులు ఉన్నారు.

ధర్మకర్త కమిటీ లేదు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ పంచాయతీ పరిధి మహసింగి గ్రామ సమీపంలో ఉన్న వరహా లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ధర్మకర్త కమిటీ లేదని కల్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న వారంతా భక్తులు, భజన బృందం సభ్యులేనన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో కమిటీ సభ్యులను ఎంపిక చేసి, పంచాయతీ తీర్మానం ద్వారా దేవదాయశాఖ అధికారులు ఆలయ అభివృద్ధి కమిటీని నియమించడం జరుగుతుందన్నారు. ఈ ఆలయం ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి సంస్థానానికి చెందిందన్నారు. సంస్థానాలు ప్రభుత్వంలో విలీనం కావడంతో అప్పటినుంచి ఈ ఆలయం దేవదాయశాఖ ఆధీనంలో ఉందన్నారు.

నీట్ యూజీ రాష్ట్ర ఫలితాల్లో సత్తా



ఎన్నింటి నేత్రు

పాతపట్నం: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ–2025 రాష్ట్ర ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. పాతపట్నం యశోదనగర్–2కు చెందిన విద్యార్థి ఎన్నింటి నేత్రు అలియాస్ నూతన్ రాష్ట్ర స్థాయిలో 865వ ర్యాంక్‌తో సత్తా చాటాడు. గతంలో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 26,878వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 12,338వ ర్యాంకు సాధించాడు. తండ్రి ఎన్నింటి వెంకట శ్రీనివాస్ ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తల్లి శారద ఏఈఓగా పాతపట్నంలో పని చేస్తున్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యేలు రవికుమార్, రూపేష్ పాణిగ్రహి

ఆమదాలవలస: ఆమదాలవలస రోటరీ క్లబ్ ద్వారా పేదలకు అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో సోమవారం రోటరీ క్లబ్ మాజీ సెక్రటరీ జలుమూరు రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా వి.టి.చౌదరి, కార్యదర్శిగా జె.కె.వెంకటేశ్వరరావు(వెంకుబాబు)ను ఎన్నుకున్నారు. వీరితో జిల్లా గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి ప్రమాణస్వీకారం చేయించారు. రావివలసకు చెందిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆ కుటుంబానికి రూ.20వేలు రోటరీ క్లబ్ తరపున అందజేశారు. ప్రత్యేక అతిథిగా హైటెక్ గ్రూప్ పర్లాకిమిడి చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్ బాబూలాల్, ట్రెజరర్ రవికుమార్, రోటేరియన్‌లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయం



సారవకోటలో వేసిన కుళాయి పైపులు

- దిష్టిబొమ్మల్లా ఇంటింటికీ కుళాయిలు
- పైపులైన్ల కోసం రహదారులను తవ్వి విడిచిపెట్టిన వైనం
- వర్షం పడితే రోడ్లు బురదమయం



కుళాయిల కోసం జగన్నాథపురంలో రోడ్డును తవ్వి విడిచిపెట్టిన మట్టి

సారవకోట: జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ వేస్తున్న కుళాయిలు చాలాచోట్ల అలంకారప్రాయంగా మారాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 74,561 గృహాలుండగా వీటిలో 33,456 గృహాలకు కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏ ఒక్క గ్రామంలోనూ సక్రమంగా తాగునీటి సరఫరా అయ్యే దాఖలాలు లేవు. కుళాయిలను ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో పటిష్టంగా ఉన్న రోడ్లను తవ్వకాలు చేపట్టి పైపులైన్లు ఏర్పాటు చేశారు. నరసన్నపేట మండలంలో ఎక్కువ కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన మూడు మండలాల్లో 40 శాతం లోపే కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. గతేడాది అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ జల్ జీవన్ మిషన్ ద్వారా ట్యాంక్ సైతం లేక పోవడంతో బోర్లుకు మోటార్లు అమర్చి నీటి సరఫరా చేయాల్సి ఉంది.

తవ్వారు.. వదిలేశారు..

మండల కేంద్రంలో ఉన్న తాగునీటి పథకం పురాతనమైనది కావడంతో అన్ని వీధులకు తాగునీరు సక్రమంగా సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 40 రోజుల క్రితం ఈ గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు అమర్చేందుకు వైశ్య, కురాకుల, బ్రాహ్మణ, కర్ణం వీధుల్లో తవ్వకాలు చేసి కుళాయి పైపులు ఏర్పాటు చేశారు. పాత పైపులు వేయడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పలు గ్రామాల్లో పైపులైన్లు కోసం సిమెంట్ రోడ్లు తవ్వడంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి వేసినవి పాడయ్యాయి. ఏ మాత్రం వర్షం పడినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. తవ్వకాలు చేపట్టిన చోట సంబంధిత కాంట్రాక్టర్లు సరిగా పూడ్చడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వడంతో పక్కనే ఉన్న మురుగు కాలువలు పలుచోట్ల పాడయ్యాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ వివరాలు..				
మండలం	సారవకోట	జలుమూరు	పోలాకి	నరసన్నపేట
మొత్తం గృహాలు	14,145	19,312	18,675	22,389
కుళాయిలు అమర్చిన గృహాలు	3,685	7,828	6,021	15,922

రోడ్లు పాడై పోతున్నాయి

జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో పైపులైన్లు వేయడంతో బాగా ఉన్న సిమెంట్ రోడ్లు పాడైపోతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో బురదమయంగా తయారవుతున్నాయి. పాడైన రోడ్లు, మురుగు నీటి కాలువలు ఎవరు బాగు చేస్తారో, ఎప్పుడు బాగుచేస్తారో తెలియడం లేదు.

– మెండ సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ, భద్రి, సారవకోట మండలం

పనులు చేయిస్తున్నాం



జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరైన తాగునీటి పథకాలను త్వరగా పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిలు అమర్చుతున్నాం.

– రట్టి మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సారవకోట మండలం

బోరు బాగుచేయరూ..



ఎల్.ఎన్.పేట మండలంలోని మోదుగువలస గ్రామ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న బోరు వారం రోజులుగా మరమ్మతులకు గురైంది. విద్యార్థులు, మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు ఇంటి నుంచి బాటిళ్లతో నీరు తెచ్చుకుంటున్నారు. వంట నిర్వాహకులు వారి ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరును బాగుచేయాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

– హిరమండలం

వానరాల హల్‌చల్



ఆమదాలవలస రూరల్ మండలంలోని చీమలవలసలో వానరాలు (కోతులు) హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఇళ్లలోకి వస్తుండడంతో బిక్కుబిక్కుమంటున్నారు. అంతే కాకుండా చిన్నారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. దీనిపై అటవీశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

ఉపాధి నిధులు గోల్‌మాల్

- రూ.కోట్లు దోచుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్, కూటమి నాయకులు
- ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస: ఉపాధి హామీ పథకం పనులు కూటమి నాయకులకు కోట్ల రూపాయలు సంపాదించే వరంగా మారిందని ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. సోమవారం బొడ్డేపల్లిపేటలో ఉన్న తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనంతా మోసమేనన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో రూ.250 కోట్లతో చేపడుతున్న ఉపాధి పనులు కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులన్నీ ఎమ్మెల్యే కూన రవికుమార్ చెప్పిన వారికే అధికారులు కట్టబెడుతున్నారన్నారు. పొందూరు మండల అధికారులు నెల్లూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు టెండర్లు పిలవకుండా పనులను కట్టబెట్టారని, ఇది ఎలా సాధ్యపడిందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రవికుమార్ అక్రమాలను పక్కాగా ఆధారాలతో బయటపెడతానన్నారు. ఉపాధి హామీ రోడ్డు పనులతోపాటు నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే అన్నదమ్ములు మాత్రమే చేస్తున్నారన్నారు. బూర్జ మండలం అల్లెనకు రహదారి వేసే క్రమంలో రైతు అనుమతి లేకుండా భూమిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొని నిర్మించారని మండిపడ్డారు. పొందూరు మండలం మొదలవలసకు 13 అభివద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం చేసినప్పటికీ ఎమ్మెల్యే సమీప బంధువు, టీడీపీ నాయకుడు మొదలవలస రమేష్‌కు పనులను కట్టబెట్టారన్నారు. ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై ఐదు నెలల నుంచి పలుమార్లు జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ కనీసం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారకపోతే కోర్టులను ఆశ్రయించడంతోపాటు ప్రజా పోరాటాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, గురుగుబెల్లి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు



నరసన్నపేట: కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కుంభా రవిబాబు



నరసన్నపేట: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, నాయకులు



జలుమూరు: కేక్ కట్ చేస్తున్న మహిళా అధ్యక్షురాలు రమణి

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విశాఖలో ఉన్న ధర్మాన కృష్ణదాస్ వద్దకు వెళ్లి పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా పరిశీలకులు కుంభా రవిబాబుతోపాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. నాలుగు మండలాలకు చెందిన ప్రధాన నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నరసన్నపేట పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, వరుదు వంశీకృష్ణ, కేసీహెచ్‌బీ గుప్త, చింతు రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

జి.వి.రమణి ఆధ్వర్యంలో..

జలుమూరు: డిప్యూటీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు శ్రీకాకుళం జిల్లా పంచాయతీ మానవ వనరుల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నరసన్నపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జి.వి.రమణి కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 8, 9వ తేదీల్లో పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, కొత్త లైన్ వేసే పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు సోమవారం తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం, కొత్త చంగుడి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



ఎన్‌బీసీ ఛానల్‌ను పరిశీలిస్తున్న క్వాలిటీ అధికారులు

నరసన్నపేట: స్థానిక వంశధార సబ్ డివిజన్ పరిధిలోని కాలువల్లో చేపడుతున్న పూడికతీత పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు సోమవారం పరిశీలించారు. మండలానికి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ డీఈ అప్పలనాయుడు, ఏఈలు తిలక్, కిరణ్, శ్రీను ఎన్‌బీసీ ఛానల్, కిల్లాం కాలువలో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. నరసన్నపేట డీఈ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



సారవకోట: మానవహారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సారవకోట: మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మార్కెట్ జంక్షన్లో మానవహారం చేపట్టారు. అంబేడ్కర్ కాలనీలో ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహించారు. మాదిగల రిజర్వేషన్ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన కృషిని వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు హరీష్ కుమార్, ఉత్తరాంధ్ర కన్వీనర్ కె.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పృథ్వీ, సంతోష్, యర్రయ్య, లోపింటి రాము, తదితరులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: స్థానిక గాంధీనగర్ వీధిలో గాంధీనగర్ మాదిగ యువజన సంఘం అధ్యక్షుడు కంటి త్రినాథరావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఉన్నట్టా.. మూత పడినట్టా?



మూతపడిన నక్కలపేట ప్రాథమిక పాఠశాల

నరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట పంచాయతీ పరిధిలోని నక్కలపేట ప్రాథమిక పాఠశాలను గత కొద్ది రోజులుగా మూతవేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గత నెలలో పదవీ విరమణ పొందారు. అసలు విషయం ఏమిటంటే చాలా నెలలుగా ఇక్కడ పూర్తిగా విద్యార్థులు లేరని, ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ దగ్గర్లో ఉండడంతో ఆ పోస్టును కాపాడుకొనేందుకు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నవారికి ఇక్కడ హాజరు నడిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఉపాధ్యాయుడు రిటైర్మెంట్‌తో పాఠశాలను పూర్తిగా మూతవేశారు. విద్యార్థులు లేకపోయినప్పటికీ ఇప్పటివరకు పారిశుద్ధ్య, ఎండీఎం కార్మికురాలకు జీతాలు చెల్లించినట్లు సమాచారం. విద్యార్థులు లేరు ఈ పాఠశాల పని చేస్తుందా.. లేదా అన్న విషయం విద్యాశాఖాధికారులకే తెలియాలి.

గత నెల వరకు జీతాలు చెల్లించాలి..

ఇదే విషయమై ఎంఈఓ బాలరాజుకు వివరణ కోరగా గత నెలవరకు విద్యార్థులు ఉన్నారన్నారు. అప్పటివరకు మాత్రమే ఎండీఎం, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించామని తెలిపారు.

వైఎస్సార్ జయంతికి తరలిరావాలి



మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ స్పీకర్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస బ్రిడ్జి డౌన్‌లో గల డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు నివాళులర్పిస్తామ న్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తరలిరావాలి..



పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: ఈ నెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గల వైఎస్సార్ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఎల్.ఎన్.పేటలో ఉదయం 11 గంటలకు, హిరమండలంలో 12 గంటలకు, పాతపట్నంలో మధ్యాహ్నం 1 గంటకు, మెళియాపుట్టిలో సాయంత్రం 3 గంటలకు, కొత్తూరులో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమాల్లో తాను పాల్గొంటానన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్ జయంతి

హిరమండలం: హిరమండలం, ఎల్.ఎన్.పేట మండల కేంద్రాల్లో ఈ నెల 8వ తేదీన వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మీసాల వెంకట రామకృష్ణ, పెనుమజ్జి విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

బూర్జ: మండలంలో

బూర్జ: మండలంలోని మదనాపురంలో మంగళవారం వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

9న వైఎస్సార్‌సీపీ సమావేశం



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: పట్టణ సమీపంలోని రావికంటిపేట వద్ద గల శ్రీనివాస కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు హాజరుకావాలని కోరారు.

సన్న బియ్యం పరిశీలన



నరసన్నపేట: బసివలసలో సన్న బియ్యాన్ని పరిశీలిస్తున్న గాయత్రి, తదితరులు



కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసిన సన్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ గాయత్రి సోమవారం పరిశీలించారు. బసివలస, యారబాడు, వీఎన్ పురం, సత్యవరం స్కూళ్లకు వెళ్లి సన్న బియ్యాన్ని తనిఖీ చేశారు. బసివలసలో ఒక ప్యాకెట్‌లో పురుగులు ఉన్నట్లు గుర్తించి, దాని స్థానంలో మరో ప్యాకెట్ సరఫరా చేస్తామన్నారని స్కూల్ హెచ్‌ఎం బాబూరావు తెలిపారు. నరసన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ గొడౌన్ ప్రతినిధి శివప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: పాఠశాలలు, వసతి గృహాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యంలో పురుగులు ఉన్నట్లు సాక్షిలో ఈ నెల 6 తేదీన కథనం వెలువడింది. ఆ కథనం మేరకు అధికారులు స్పందించారు. సివిల్ సప్లయ్ డీఎం ఆదేశాల మేరకు కొత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాలకు కొత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేశారు. సన్న బియ్యాన్ని సోమవారం సివిల్ సప్లయ్ అధికారులు కళాసాగర్, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శైలజ, డీఏ గోపాలరావు పరిశీలించారు. పాఠశాలకు గత నెలలో పంపిణీ చేసిన బియ్యం, ఎస్సీ బాలుర వసతి గృహానికి ఈ నెలలో పంపిణీ చేసిన బియ్యంలో పురుగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి స్థానంలో బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.